క్లుప్తంగా

రేపు వేడుకోలు దీక్ష

ఒంగోలు: సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ నెల 10న వేడుకోలు దీక్ష నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర నాయకురాలు కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రాలలో అన్ని విభాగాల వారిని కలుపుకుని సమీక్షలు చేసి ఆదివారం కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి అందరూ హాజరయ్యేందుకు సిద్ధం కావాలని కోరారు.

12 నుంచి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ఒంగోలు: ఒంగోలు మండల స్థాయిలో అండర్-11, అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఆటలు, క్రీడా పోటీలు, మండల జట్టు ఎంపికను ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఒంగోలు మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల ప్రజా పరిషత్, ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు 12, 13 తేదీల్లో స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9948837765ను సంప్రదించాలని సూచించారు.

ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మద్దిపాడు: మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన జాతీయ రహదారిపై మండలంలోని మద్దిపాడు ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. మండలంలోని కొలచనకోట గ్రామానికి చెందిన దొక్కా పవన్ కల్యాణ్, అతని పిన్ని తాళ్లూరు అనూష మోటార్ సైకిల్‌పై ఒంగోలు బయలుదేరి వెల్లంపల్లి నుంచి మద్దిపాడు వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. అదే రాంగ్‌రూట్‌లో వెనుక నుంచి వచ్చిన పూలబస్తాల ఆటో వారి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్‌కల్యాణ్‌కు కాలర్‌బోన్ విరిగిపోగా, అనూషకు వెన్నుపూస నొక్కుకుపోయి లోపల తీవ్రగాయం అయినట్లు సమాచారం. 108 సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కాంగ్రెస్ ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్‌గా కాలేమస్తాన్

ఒంగోలు : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్‌గా దూదేకుల కాలేమస్తాన్‌ను నియమిస్తూ ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత నియామకపత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకరరెడ్డి శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కాలేమస్తాన్‌కు అందించారు.

పురందేశ్వరికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృతజ్ఞతలు

ఒంగోలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తనను మరోసారి పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు పురందేశ్వరితో పాటు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీకి కృతజ్ఞతలు తెలిపారు.

పోషక విలువలపై అవగాహన అవసరం

చీమకుర్తి: విద్యార్థులకు ఆహారంలో అందించాల్సిన పోషక విలువలపై మండలంలోని మంచికలపాడు మండల పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రులకు ఒంగోలు రోటరీ క్లబ్ నిర్వాహకులు శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు బలమైన ఆహారం అందిస్తే వారిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం పెరుగుదల ఉంటుందని వివరించారు. రోటరీ క్లబ్ తరఫున క్విస్ కాలేజీకి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బండ్లమూడి జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం టీఎల్ కాంతారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రోటరీక్లబ్ తరఫున రాంబాబు, ప్రనూష పాల్గొన్నారు.

ఘనంగా గరికిపాటి రాజారావు వర్ధంతి

ఒంగోలు మెట్రో: కళ ప్రజల కోసం అంటూ నినదించిన ప్రజా కళాకారుడు డాక్టర్ గరికిపాటి రాజారావు 60వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం రాత్రి స్థానిక ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కళావేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించి మాట్లాడారు. కళారంగానికి రాజారావు చేసిన సేవలను స్మరించుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ సీహెచ్ సుధాకర్ బాబు మాట్లాడుతూ సమాజానికి మంచి చేసిన వారిని ప్రజలు గుర్తుచేసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారు. గరికపాటి రాజారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు పలు గీతాలు ఆలపించారు. ప్రముఖ మెజీషియన్ బీవీ.రామన్, ప్రముఖ సంఘ సేవకుడు మారెళ్ల సుబ్బారావును సన్మానించారు. మ్యాజిక్ షో ఆహుతులను అలరింపచేసింది. కార్యక్రమంలో ప్రతిభ విద్యాసంస్థల సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ, బొమ్మరిల్లు నిర్వాహకులు రాజ్యలక్ష్మి, సీహెచ్ సుధీర్ బాబు, బాదల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆదరించండి

- గడపగడపలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు, సైడు కాలువలకు శంకుస్థాపన



సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: పేద ప్రజలకు నిరంతరం సంక్షేమ పథకాలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లోనూ ఆదరించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కోరారు. సంతనూతలపాడులోని 1, 2 సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం అధికారం చేపట్టినప్పటి నుంచి పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. పథకాలన్నీ ఇలాగే పేదలకు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులోని గానుగపాలెంలో రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు, సైడు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే టీజేఆర్ శంకుస్థాపన చేశారు. మండలంలో జరుగుతున్న రోడ్లు, కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు 1, 2 సచివాలయాల పరిధిలో 1200 ఇళ్లను సందర్శించి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఏ ఇంట్లో ఎవరెవరికి ఎంతెంత మొత్తంలో సంక్షేమ పథకాలు అందాయో తెలుసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. తొలుత వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో డప్పువాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, వైస్ ఎంపీపీ టీ రాగమ్మ, ఎంపీటీసీ బాపట్ల సుబ్బారావు, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సొసైటీ మాజీ ఎండీ రామ్‌ప్రసాద్, బ్రాహ్మణ సంఘ నాయకులు పీ సాయికుమార్, ఏఎంసీ డైరెక్టర్ బూదాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టీజేఆర్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, నాయకులు, సర్పంచ్‌లు కత్తినేని శ్రీనివాసరెడ్డి, బీ శైలజ, గౌతమి, కోమలి, అమర్‌నాథ్, ఎస్‌కే రహంతుల్లా, ఎస్.రమణమ్మ, జీ శరత్‌బాబు, జీ అయ్యన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి

- అక్టోబర్ 1 నుంచి నెలరోజులపాటు జగనన్న సురక్ష కార్యకమం
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ చిడితోటి జీవన్



మాట్లాడుతున్న డాక్టర్ జీవన్, డాక్టర్ నందకిషోర్

ఒంగోలు: ఆరోగ్య ఆంధ్రే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ చిడితోటి జీవన్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రత్యేక మానవీయ కోణాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో గతంలో 2600 వ్యాధులు మాత్రమే ఉంటే మరో 800 వ్యాధులను చేర్చారని, తద్వారా వైద్య విభాగానికి సంబంధించి వెయ్యి రూపాయలు దాటే వ్యాధులన్నీ కూడా ఆరోగ్యశ్రీలోకి వచ్చాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతో తోడ్పడుతోందన్నారు. ఆరోగ్యంపై ప్రభుత్వం ఇప్పటివరకు రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి కోటీ 40 లక్షల మందిని ఆరోగ్యవంతులను చేసిందన్నారు. తుంటి ఎముక ఆపరేషన్‌కు రూ.1.20 లక్షలు మొదలు రూ.2 లక్షలు వ్యయం చేయాల్సి ఉంటుందని, అయినా సీఎం ఓకే అంటూ కేవలం ఒక్క ఎముకలు, కీళ్ల విభాగంలోనే పది నెలల కాలంలో రూ.30 కోట్లు ఖర్చుపెట్టారని వెల్లడించారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వల్ల వ్యాధి ప్రాథమిక దశలోనే దాని తీవ్రతను గుర్తించి చికిత్స అందించడం, అవసరం అనుకుంటే దానిని ఆరోగ్యశ్రీ చికిత్సకు ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ విధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. గతంలో రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలలో వైద్య సిబ్బంది కొరతతో రోగులు ఆస్పత్రులకు వచ్చేవారు కాదని, తద్వారా వైద్యంలో పీజీ చేసేందుకు విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారని తెలిపారు. కానీ నేడు ఆ అవసరం లేదని, నూతనంగా 12 మెడికల్ కాలేజీలు మంజూరవగా అందులో 5 కాలేజీలలో ఈ ఏడాదే వైద్యసీట్ల భర్తీ చేపట్టనున్నారని చెప్పారు. దాంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 12 వేలమందిని నియమించడంతో ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అందువల్ల మన రాష్ట్రంలోనే పీజీ చేసుకునే సౌలభ్యం కూడా కలిగిందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉండటం, ఆస్పత్రుల్లో అధునాతన సౌకర్యాలు, మౌలిక సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉంచడం వంటి నాణ్యమైన సేవలు అందించేందుకు అవసరమైన నిధులు కేటాయించడం వల్లే సాధ్యపడిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వాలు ప్రశంసించిన విషయం గమనించాలన్నారు. పాఠశాలల్లో సైతం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ చేపట్టడం, వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఎంతోమందికి కంటి జబ్బులు నయం చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ప్రతి సచివాలయ పరిధిలో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, ఒక ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ కలిసి 30 రోజులపాటు ఆ సెచివాలయం వద్దే ప్రజలను పరీక్షిస్తారన్నారు. ఎవరికైనా వ్యాధి ఉందని గుర్తిస్తే వారికి తక్షణమే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం కూడా అందించేందుకు ప్రవేశపెడుతున్న ఈ పథకం కూడా ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంటూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

జల్‌జీవన్ పనులపై కేంద్ర బృందం సంతృప్తి



కుళాయిలను తనిఖీ చేస్తున్న మనోజ్ బాప్నా

గాదెపాలెం (కొత్తపట్నం): జల్‌జీవన్ మిషన్ పనులపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కొత్తపట్నం మండలంలోని గాదెపాలెం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం పనులను సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్స్ మనోజ్ బాప్నా ఆధ్వర్యంలో కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో గాదె రజిని, పల్లప్రోలు నాగమ్మ ఇళ్లకు వెళ్లి ఉచితంగా ట్యాప్‌లు బిగించారా, నగదు తీసుకున్నారా, రోజుకు ఎన్ని లీటర్ల నీరు వస్తోంది, ఆ నీరు మీకు సరిపోతోందా..? అనే వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ నీరు వస్తోందని, సరిపోతోందని వారు చెప్పడంతో కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మనోజ్ బాప్నా మాట్లాడుతూ ట్యాప్‌లు బిగించడం ముఖ్యం కాదని, భాగస్వామ్యం కూడా ఉండాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని అన్నారు. పైపులు పగలకుండా మట్టి, సిమెంట్‌తో కప్పుకోవాలని సూచించారు. గ్రామంలో వేసిన ట్యాప్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలో పంటలు, ఉప్పు సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. శనగ, వేరుశనగ, వరి పంటలు పండిస్తామని ప్రజలు తెలిపారు. చెరువుల్లో పూడికలు తీసుకుని శుభ్రం చేసుకోవాలని సూచించారు. తాగునీటితో పాటు వ్యవసాయానికి కూడా సాగర్ జలాలు అవసరమని, అవి కూడా వచ్చే విధంగా చూడాలని రైతులు కోరారు.

విలేజ్ శానిటేషన్ కమిటీతో ఎన్నో ఉపయోగాలు...

గ్రామాల్లో విలేజ్ శానిటేషన్ కమిటీ ఏర్పాటుతో ఎన్నో ఉపయోగాలున్నాయని మనోజ్ బాప్నా తెలిపారు. క్యాలిటీ పెంచేందుకు కొత్త సిస్టం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ పద్ధతి లేకుండా కమిటీనే అన్ని పనులు చేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. 13 శాతం కాంట్రాక్టర్‌కు చెందుతుందని, అవి మీకే మిగిలే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో డ్వాక్రా గ్రూపుల గురించి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కేంద్ర బృందాన్ని సన్మానించారు. అనంతరం ఆలూరు గ్రామంలో సాగర్ కాలువ, గుండ్లకమ్మ నుంచి వచ్చే ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించారు. నీరు ఎక్కడ నుంచి వస్తాయి, ఎన్ని వస్తాయనే వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ టెక్నికల్ అధికారి పి.యాదయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ కె.శ్రీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్‌ఆలీ, జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దర్శి సుధీర్, ఏపీడీ వెంకటస్వామి, జిల్లా నీటి నాణ్యత పర్యవేక్షణ అధికారి బి.సుభాషిణి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఏపీవో రత్నజ్యోత్స్న, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, సర్పంచ్ సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, దొడ్ల రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని తనిఖీ చేసిన కేంద్ర బృందం


కొత్తపట్నంలోని సోషల్ ఫారెస్టర్ నర్సరీని కేంద్రం బృందమైన సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ట్రైబర్ వెల్ఫేర్స్ మనోజ్ బాప్నా, ఇతర సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీలో ఎన్నిరకాల మొక్కలున్నాయి, ఏడాదికి ఎన్ని మొక్కలు సరఫరా చేస్తున్నారు, ఎన్ని బతికి ఉన్నాయనే వివరాలడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక్క మొక్క కూడా చావకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రేంజ్ ఆఫీసర్ ప్రత్యూష్‌ను ఆదేశించారు. మొక్కల సంరక్షణపై సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ శీనారెడ్డి, ఏపీవో రత్నజ్యోత్స్న, జేఈ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నులో తేడాలుంటే సహించేది లేదు


ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను విషయంలో తేడాలుంటే సహించేది లేదని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఒంగోలు నగరంలోని పలు డివిజన్లలో ఆస్తి పన్నుకు సంబంధించి శుక్రవారం ఇళ్ల కొలతలు తీయించారు. ఒంగోలు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగానికి సంబంధించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన కొలతలను కమిషనర్ స్వయంగా పరిశీలించారు.

భాగ్యనగర్‌లో కొత్తగా ఆస్తి పన్ను కోసం వేస్తున్న కొలతలను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.40 కోట్ల పన్నులు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు ఐదు నెలలు పూర్తయిందని, కేవలం రూ.15 కోట్లు మాత్రమే వసూలు చేశామని అన్నారు. మిగతా రూ.25 కోట్లను నెలవారీగా నిర్ణయించిన లక్ష్యాల మేరకు వసూలు చేయాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు నగరంలోని 70 వార్డు సచివాలయాల అడ్మిన్లు, వలంటీర్లతో పాటు సంబంధిత సిబ్బంది, అధికారులు చొరవ చూపాలన్నారు. కేటాయించిన నోడల్ ఆఫీసర్లు నెలవారీ లక్ష్యాలను అధిగమించాలని కమిషనర్ ఆదేశించారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లతో పాటు ఆస్తి పన్ను వేయని షాపులను కూడా గుర్తించి పన్ను వేయాలని సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లు, షాపులను కూడా గుర్తించి వెంటనే ఆస్తిపన్ను వేయాలని ఆదేశించారు. అందుకోసం పన్నులు వసూలు చేస్తే నగరంలో ఇంకా అభివృద్ధి చేసేందుకు వీలవుతుందని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ అధికారులు, ఆర్‌ఐలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



తులసీదళార్చన అందుకుంటున్న స్వామివారు



ఊరేగింపులో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులు

ఒంగోలు మెట్రో: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఒంగోలు నిర్మల్‌నగర్ పార్క్ వద్ద నుంచి కృష్ణ భగవానుడి ఊరేగింపును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుని స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. సేవా సమితి అధ్యక్షుడు సుబ్బారావు, ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణునికి తులసీదళార్చన

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దక్షిణం బజారులోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారికి కోటి తులసీ దళార్చన కార్యక్రమాన్ని వాయుగుండ్ల కోటయ్య శ్రేష్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు భాగవతుల శ్రీనివాసచార్యులు నేతృత్వంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రకాశం పోరుయాత్రను జయప్రదం చేయాలి

ఒంగోలు టౌన్: వెనకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన పోరుయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పోరుయాత్ర ప్రచార సామగ్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్ర వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 10వ తేద దొనకొండలో ప్రారంభమయ్యే పాదయాత్రను రాజ్యసభ మాజీ సభ్యుడు పెనుమల్లి మధు ప్రారంభిస్తారని తెలిపారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న జగదీష్

ఒంగోలు: విద్యార్థులు నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటేనే ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని ఆర్కిటెక్ట్ డేవ్ అప్స్ ఇంజినీర్ జగదీష్ కడలి అన్నారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు 'రోల్ ఆఫ్ డేవ్ అప్స్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ జగదీష్ మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఐటీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని చెప్పారు. డేవ్ అప్స్ సాంకేతికత సంక్షోభంలోనూ అనేక అవకాశాలు కలిగిస్తోందని చెప్పారు. విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.కె.మూర్తి, సీఎస్‌సీ విభాగం హెడ్ డాక్టర్ సురేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ గిరాబాబు, కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడి అభినందనలు



శిద్దా సుధీర్‌ను అభినందిస్తున్న ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ద్వారకానాథ్, తదితరులు

ఒంగోలు: టీటీడీ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన శిద్దా సుధీర్‌కుమార్‌ను శుక్రవారం ఆయన నివాసంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, తదితరులు కలుసుకుని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. సుధీర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిల్లంచర్ల బాలమురళీకృష్ణ, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రావూరి కాశీరంగ జనార్దన్, ప్రధాన కార్యదర్శి జలదంకి కృష్ణారావు, కోశాధికారి కొత్తూరి రంగనాయకులు, కొణిజేటి సురేష్, బ్రహ్మయ్య, చినిగేపల్లి సురేష్, బీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గృహ సారథులు, కన్వీనర్లకు బీమా సౌకర్యం

- పత్రాలు పంపిణీ చేసిన నగర మేయర్ గంగాడ సుజాత



బీమా పత్రం అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని వార్డు సచివాలయ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మేయర్ గంగాడ సుజాత తెలిపారు. నగరంలోని 18వ డివిజన్ చెరువుకొమ్ము పాలెంలోని సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లకు బీమా సౌకర్యం కల్పించి సంబంధిత పత్రాలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి శంకర్, డివిజన్ నాయకులు జడా సుధాకర్, హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లూరి నర్సింగ్ హోమ్‌లో ఆస్టర్ రమేష్ వైద్య సేవలు

- ప్రారంభించిన ఆస్టర్ రమేష్ ఎండీ రమేష్‌బాబు



నల్లూరి నర్సింగ్ హోంను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌గా ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

ఒంగోలు అర్బన్: స్థానిక నల్లూరి నర్సింగ్‌హోమ్‌లో ఇక నుంచి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం నల్లూరి నర్సింగ్ హోమ్‌లో ఆస్టర్ రమేష్ వైద్య సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ఆస్టర్ రమేష్ నల్లూరి హాస్పిటల్ అనే సరికొత్త బ్రాండ్ నేమ్‌తో కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటి నుంచి నల్లూరి హాస్పిటల్ వైద్య సేవలతో పాటు నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చూస్తాయన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఆర్థోపెడిక్ విభాగాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు క్రిటికల్ కేర్, ఇన్‌పేషెంట్ వైద్యసేవలు, టెలీ ఐసీయూ, టెలీ ఎమర్జెన్సీ, తదితర సేవలన్నీ క్లౌడ్ డాక్స్ రమేష్ మెయిన్‌హబ్‌కు అనుసంధానం చేయడంతో మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, డాక్టర్ నల్లూరి రంగారావు, నల్లూరి రాఘవరావు, నల్లూరి అరుణారావు, ఆస్టర్ రమేష్ సీఓఓ డాక్టర్ హరికుమార్, కార్తీక్‌చౌదరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరికి శ్రావణ శుక్రవార శోభ

- సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులతో కళకళలాడింది. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు పాదిలి భానుప్రకాశశర్మ, శనగవరపు రవితేజ భక్తులచే శాస్త్రోక్తంగా సామూహికంగా వరలక్ష్మీ పూజ, కుంకుమార్చన నిర్వహించారు. వ్రతంతో పాటు వరలక్ష్మీ పూజ చేయడం వల్ల సిద్ధించే విశేష పుణ్య ఫలం గురించి భక్తులకు పండితులు వివరించారు. పూజకు అవసరమైన సామగ్రితో పాటు వెంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి అమ్మవారి రూపులను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఆలయ అర్చకులు శ్రీవారికి శుక్రవార విశేష అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కక్షిదారులంతా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి కోరారు. కక్షిదారుల సౌకర్యార్థం దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. రాజీపడేందుకు అర్హత కలిగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహార చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు, ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, పెండింగ్ కేసుల్లో ఉన్నవారు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో అప్పీలుకు వెళ్లే అవకాశం లేదని, కోర్టుల్లో చెల్లించిన కోర్టు ఫీజును సైతం తిరిగి పొందవచ్చన్నారు. ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరిస్తారన్నారు. అదే విధంగా పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన ర్యాలీ

ఒంగోలు అర్బన్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, ఆర్‌పీఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆస్టర్ రమేష్ సీఓఓ హరికుమార్, మెడికల్ సూపరింటెండెంట్ వంశీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించారు.